మకర సంక్రాంతి శుభాకాంక్షలు

భోగ భాగ్యాల 'భోగి'


గుడిపాల: 189కొత్తపల్లెలో..


బంగారుపాళెం: ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు


తవణంపల్లె : టి.పుత్తూరులో వేసిన భోగి మంటలు

బంగారుపాళెం/చిత్తూరు రూరల్/ తవణంపల్లె/ గుడిపాల/యాదమరి/పూతలపట్టు: చిత్తూరు నగరం, చిత్తూరు, బంగారుపాళెం, తవణంపల్లె, గుడిపాల, యాదమరి, పూతలపట్టు మండలాల వ్యాప్తంగా శనివారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఇళ్ల ముందు భోగిమంటలు వేసి పెద్దలు, పిల్లలు చలి కాచుకుని సందడి చేశారు. లోగిళ్ల ముందు రంగు రంగుల రంగవల్లులను తీర్చారు. కొత్త దుస్తులు ధరించి పూజలు చేశారు. బతుకుదెరువు దూరప్రాంతాల్లో ఉంటున్న వారు స్వగ్రామాలకు రావడంతో సంక్రాంతి కళ వచ్చింది. మహిళలు గొబ్బెమ్మ పాటలతో సందడి చేశారు. తవణంపల్లె మండలం టి.పుత్తూరులో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, పరుగు పందేలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గుడిపాల మండలం 189లో కొత్తపల్లెలో విద్యుద్దీపాల అలంకరణతో సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికారు.


పూతలపట్టు: బహుమతులు ప్రదానం చేస్తున్న పారిశ్రామిక వేత్త జగదీశ్వర్‌రెడ్డి

గుండ్లకట్టమంచిలో ముగ్గుల పోటీలు

బంగారుపాళెం మండలం గుండ్లకట్టమంచిలో శ్రీజ డెయిరీ ఆవరణలో మహిళా పాడి రైతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ హరినాథ్, గుండ్లకట్టమంచి మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, శ్రీజ డెయిరీ సీఈఓ జయతీర్థాచారి బహుమతులు ప్రదానం చేశారు. ఏపీఎం మీరాబాయి, మొగిలి రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో సంక్రాంతి జోరు

పూతలపట్టు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని శనివారం మద్దిలయ్యగారిపల్లెలో మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను వ్యాపారవేత్త జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే తిమ్మిరెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలను జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక ప్రారంభించారు. అనంతరం యం.బండపల్లెలో సర్పంచ్ పద్మావతి ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహించి విన్నర్స్, రన్నర్స్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామతులసి బాలాజీ, సిద్ధారెడ్డి, ఎంఎస్.మణి, ఖాదర్ వల్లి, యతీష్, జ్యోతి, స్వామినాథన్, చిట్టెమ్మ, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!


స్వామి వారి పల్లకిని మోస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీకోదండరామ స్వామి ఆలయంలో శనివారం శ్రీగోదారంగనాథుల తిరుకల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత కోదండరాముడికి ప్రత్యేక అభిషేక పూజల అనంతరం గోదారంగనాథ స్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణవేదికపై ఆశీనులు చేశారు. చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వామి వారికి మేళతాళల నడుమ పట్టువస్త్రాలను సమర్పించారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. తదనంతరం పల్లకిలో స్వామివార్లను ఊరేగించారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకటేష్‌గుప్తా, అర్చకులు వేణుగోపాల్, సభ్యులు రాజా, హేమాద్రి, మాధవి, ఈశ్వరి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

సత్యమ్మకు విశేష పూజలు


కె.పట్నంలో సత్యమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: భోగి పండుగ సందర్భంగా మండలంలోని కె.పట్నంలో శనివారం సత్యమ్మకు అర్చకులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు దూర్వాసులు రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేణురెడ్డి, ప్రసాద్ రెడ్డి, బాబురెడ్డి, సుధాకర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతి దర్శనం


స్వామి వారి ఊరేగింపు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం ప్ర శాంత్‌నగర్‌లోని శ్రీ శాస్త్రగిరి అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం జ్యోతి దర్శనం కల్పించారు. స్వామి వారిని ఈశ్వరగుడి వీధి నుంచి బజారువీధి, హైరోడ్డు, గిరింపేట, ప్ర శాంత్‌నగర్ మీదుగా ఆలయం వరకు కే రళవాయిద్యాల నడుమ ఊరేగించారు. అనంతరం ఆలయంలో మకర జ్యోతి దర్శన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

197 రామాపురంలో..


197 రామాపురంలో ఉత్సవమూర్తి మణికంఠస్వామి

గుడిపాల: మండలంలో 197రామాపురంలోని వీరబ్రహ్మంగారి మఠంలో ఉన్న అయ్యప్పస్వామి మందిరంలో శనివారం మకరజ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి దీపారాధన చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామికి పాలాభిషేకం, నేతి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. తిరు ఆభరణాలను స్థానిక శివాలయం నుంచి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి, పడిపూజ అనంతరం కర్పూర హారతితో జ్యోతి దర్శనం భక్తులకు కల్పించారు. ఉత్సవమూర్తులైన మణికంఠ బాలునికి విశేష అలంకరణ చేసి పుష్పపల్లకి సేవలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. గురుస్వామి మురారి కన్నయ్యదాసు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యాదమరిలో..


యాదమరి: ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

యాదమరి: స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం రాత్రి అయ్యప్ప మకర జ్యోతి దర్శనం కల్పించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో అయ్యప్ప విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. స్వామివారి చిత్రపటాన్ని గ్రామ వీధులలో ఊరేగించారు.

4 దశాబ్దాల తర్వాత అ'పూర్వ' కలయిక


గుండ్లకట్టమంచి హైస్కూలులో కలిసిన పూర్వ విద్యార్థులు

బంగారుపాళెం: 40 ఏళ్ల క్రితం 10వ తరగతి చదివిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి జెడ్పీ హైస్కూలు దీనికి వేదికైంది. ఇక్కడ 1979–80లో 10వ తరగతి చదివిన వారంతా కాలక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి పండుగ రోజు అప్పటి బ్యాచ్ వారంతా కలిశారు. జ్ఞాపకాల పూదోటలో విహరించారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురువులను స్మరించారు.

ఫ్రైడే డ్రైడేగా పాటించండి

తవణంపల్లె: ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి దోమలు, లార్వాల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పీరూసాహెబ్ సూచించారు. మండలంలోని బైరేశ్వర కాలనీ, దిగువ మొదలపల్లె కాలనీలో ఇద్దరు పిల్లలు డెంగీ బారిన పడడంతో వైద్య బృందంతో పీరూసాహెబ్ ఆ గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల వద్ద నీటి తొట్టెలను పరిశీలించి లార్వాలను నిర్మూలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవా లని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, జయమ్మ, హరి, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు భాగ్యం, నవనీతమ్మ, మలేరియా సిబ్బంది మనోహర్, నారాయణ, ఆశావర్కర్లు సౌందర్య, ఉమావతి, పుష్ప, ధనమ్మ పాల్గొన్నారు.